ప్రజావాణికి 37 అర్జీలు

అర్జీలను స్వీకరిస్తున్న జడ్పీ సీఈవో జానకీరెడ్డి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 3 : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి వారం నిర్వహించే ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 37 అర్జీలు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేసి వాటిని సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఆయా అర్జీలను స్వీకరించిన జడ్పీ సీఈవో జానకిరెడ్డి వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డీఎం రాజేశ్వర్, డీపీవో సాయిబాబా, కలెక్టరేట్ ఏవో పరమేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జాతరలో ఎమ్మెల్యే పూజలు

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, మార్చి 3 : హత్నూర మండలం రొయ్యపల్లిలో సోమవారం జరిగిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతరలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఆగమయ్య, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, ప్రవీణ్ కుమార్, సత్యంగౌడ్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

పరామర్శ

పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేత గోవర్ధన్ రెడ్డి

జిన్నారం మార్చి 3 : ప్రమాదవశాత్తు గాయపడిన నాయకుడిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సోమవారం పరామర్శించారు. జిన్నారం మండలం మంగంపేట గ్రామానికి చెందిన ఉద్యమకారుడు, సీనియర్ నాయకుడు సార నరేందర్ ఇటీవల భవనం పైనుంచి పడ్డాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి నరేందర్‌ను పరామర్శించారు. మండల శాఖ అధ్యక్షుడు రాజేశ్, నాయకులు భోజిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జనార్దన్, శివరాజ్, నక్క నరేందర్, భిక్షపతి గౌడ్, రామకృష్ణ గౌడ్, మల్లేశం రామకృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల పునరుద్ధరణకు విరాళం

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేతలో పాల్గొన్న నేతలు

జిన్నారం మార్చి 3 : ఆలయాల పునరుద్ధరణకు సంపూర్ణ సహకారం అందిస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని కాజిపల్లిలో నిర్మిస్తున్న కాశీ విశాలాక్షి విశ్వనాథ గణపతి ఆలయానికి రూ. 1,01,1 16, సోలక్పల్లి గ్రామంలో నిర్మిసు న్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి రూ.40 వేలను ఆలయ కమిటీ సభ్యులకు నగదు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతన వంటి పవిత్ర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు గోవర్ధన్ రెడ్డిని ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు చిట్ల సత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి, రాజేశ్, భోజిరెడ్డి, శివరాజ్, జనార్దన్, శ్రీధర్ గౌడ్, శాంత వర్మ రెడ్డి, కృష్ణ గౌడ్, రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాల మేరకే భూమిని పరిశీలించాం

వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ తిరుమలరావు

ఝరాసంగం, మార్చి 3 : కోర్టు ఆదేశాల మేరకు ఝరాసంగం మండలం మాచనూర్ గ్రామ శివారులోని 100/12 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో సోమవారం తహసీల్దార్ తిరుమలరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 ఎకరాలకు సంబంధించిన భూమి వివాదం కొనసాగుతుండగా అందులో ఓ పార్టీ టీఎం-33 కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుందన్నారు. ఈ దరాఖాస్తు ప్రకారమే భూ పరిశీలనకు వెళ్లామని తెలిపారు. ఈ భూమిపై ఇంకా స్పష్టత రాలేదని, మారోమారు అక్కడికి వెళ్లి విచారణ జరిపి ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తామని వెల్లడించారు. కోర్టు ఆదేశాలను రెండు పార్టీలకు సంబంధించిన వారు దిక్కరించకూడదని తెలిపారు. నాయబ్ తహసీల్దార్ యాసిన్ ఖాన్, ఆర్ఐ రామారావు, సర్వేయర్ నర్సింహులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పుస్తకాలతో విద్యార్థులు

కంది, మార్చి 3 : కంది ఓడీఎఫ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు తెలుగు అభ్యాసన పుస్తకాలను సోమవారం అందజేశారు. పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు సొంత ఖర్చులతో 26 మంది విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రజిత అభినందించారు. ఉపాధ్యాయులు విజయ భాస్కర్, రవీందర్, చవాన్ సుభాన్‌సింగ్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో నేరస్తుడికి జీవితఖైదు

రామచంద్రాపురం, మార్చి 3 : పోక్సో కేసులో నేరస్తుడికి జిల్లా అడిషల్ సెషన్ కోర్టు సోమవారం జీవితఖైదు విధించింది. కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2024 మే నెలలో కొల్లూర్‌లోని 2బీహెచ్‌కేలో నివాసం ఉండే మిర్జా అక్బర్‌బేగ్ అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి లైంగికదాడి చేశారు. ఈ విషయంలో కొల్లూర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు మిర్జా అక్బర్ బేగ్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆధారాలను పోలీసులు కోర్టుకు సమర్పించారు. కేసు విచారణలో భాగంగా నేరం రుజువుకావడంతో జిల్లా అడిషనల్ సెషన్ కోర్టు జడ్జి జయంతి నేరస్తుడికి రూ.5వేలు జరిమానా, జీవితఖైదు విధిస్తు తీర్పుని వెల్లడించారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్, కానిస్టేబుల్ నర్సింహులు, సమన్స్ ఏఎస్సై రవీందర్‌రెడ్డిలను అభినందించారు.

భద్రతా వారోత్సవాల ఆహ్వాన పత్రాలు అందజేత

పటాన్‌చెరు, మార్చి 3 : ఈ నెల 10న బీడీఎల్ భానూర్‌లో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం బీడీఎల్ పరిశ్రమలో కార్మికులకు, సిబ్బందికి, అధికారులకు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యురిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) అధికారులు భద్రత వారోత్సవాల కార్యక్రమ ఆహ్వాన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ సంతానకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్ అర్షద్ అలీఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్బందులు తొలిగించాలి

- పట్టణ రోడ్లపై నిర్లక్ష్యం వెనుక ఎంపీ, ఎమ్మెల్యే స్వప్రయోజనాలు
- మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

ఖేడ్ బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 3: నారాయణఖేడ్ పట్టణంలో గుంతలమయంగా మారిన రోడ్ల దుస్థితి వెనుక స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే స్వప్రయోజనాలు దాగి ఉన్నాయని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆరోపించారు. నిజాంపేట్-బీదర్ ఎన్‌హెచ్ 161 బీ రహదారి పనులు చేపడుతున్న కాంట్రాక్టరే పట్టణంలోని ప్రధాన రహదారులను మెరుగుపర్చాల్సి ఉండగా, ఎంపీ, ఎమ్మెల్యే, కాంట్రాక్టర్ నుంచి కమీషన్లు దండుకున్న కారణంగానే సదరు కాంట్రాక్టర్ ఆయా పనులు చేపట్టడం లేదని విమర్శించారు. సోమవారం నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.353 కోట్లతో మంజూరైన నిజాంపేట్-బీదర్ రహదారి టెండర్ ప్రక్రియ కూడా తమ ప్రభుత్వ హయాంలోనే పూర్తయిందని, జాతీయ రహదారి నిర్మాణంతో పాటు పట్టణంలోని ప్రధానరోడ్లు, ఇతరత్రా రోడ్లు మెరుగుపర్చే విధంగా టెండర్ నిబంధనలున్నాయన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రతిపాదించిన మేరకు రూ.50 కోట్ల రోడ్డు భద్రత నిధులు మంజూరు దశలో ఉండగా ఎన్నికల అనంతరం తాను ఓటమి చెందిన తర్వాత ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే ఆ ప్రతిపాదనను పట్టించుకొని కారణంగా నిధులు మంజూరు కాలేదన్నారు. ప్రస్తుతం పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ గుంతమయంగా మారి వాహనాలు తరచు ప్రమాదాలకు గురి కావడంతో పాటు పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎన్‌హెచ్ కాంట్రాక్టర్‌తో ఆయా రోడ్లను మెరుగుపర్చే అవకాశమున్న ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. నారాయణఖేడ్ నుంచి మనూరు వరకు కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు సక్రమంగా చేపట్టకపోవడం మూలంగా వాహనదారులకు అవస్థలకు గురవుతున్నారన్నారు. మొత్తం ఒకేసారి కాకుండా బిట్ల వారీగా పనులను పూర్తిస్థాయిలో చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో పాటు ఎన్‌హెచ్ ఉన్నతాధికారులు చొరవచూపి వారం రోజుల్లోగా పనులు ప్రారంభించాలని లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నర్సింహారెడ్డి, ఆహీర్ పరశురాం, నగేశ్, అభిషేక్ శెట్కార్, ముజామ్మిల్, విఠల్, అంజాగౌడ్, సంగప్ప, నర్సింహులు, మల్గొండ ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

కాజిపల్లిలో అక్రమ నిర్మాణాలను జేసీబీతో నేలమట్టం చేయిస్తున్న ఆర్ఐ జైప్రకాశారాయణ

జిన్నారం మార్చి 3 : అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన పలు కట్టడాలను నేలమట్టం చేశారు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజిపల్లి 181 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్న ఫిర్యాదులతో తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జైప్రకాశ్ నారాయణ నేతృత్వంలో సిబ్బంది పలు అక్రమ కట్టడాలను గుర్తించి జేసీబీ సాయంతో కూల్చివేతలు చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడితే చూస్తూ ఊరుకోమని ఆర్ఐ హెచ్చరించారు. అవసరమైతే క్రిమినల్ కేసులో నమోదు చేస్తామని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

జహీరాబాద్, మార్చి 3 : సంగారెడ్డి జిల్లా కరస్‌గుత్తికి చెందిన అదృశ్యమైన యువకుడి మృతదేహం న్యాల్‌కల్ మండలం రాఘవపూర్ గ్రామ శివారులోని మంజీర నదిలో సోమవారం లభ్యమైంది. హద్నూర్ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సోమవారం ఉదయం మంజీరా నదిలో చేపలను పట్టేందుకు వెళ్లిన మత్స్యకారులకు మృతదేహం కనిపించింది. వెంటనే హద్నూర్ పోలీసులకు సమాచారం అందించారు. మంజీర నదిలో గుర్తుతెలియని మృతదేహం తెలినట్టు అదృశ్యమైన యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మంజీర నదిలో తెలిన మృతదేహాన్ని మత్స్యకారులు బయటకు తీసుకువచ్చారు. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు అదృశ్యమైన కుమారుడు చౌహాన్ సునీల్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దరఖానకు తరలించారు. అదృశ్యమైన యువకుడు చౌహాన్ సునీల్ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ నెల 26న మృతిచెందిన యువకుడి వివాహం ఉందని, అంతలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులను మృతిపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే సునీల్‌ది ఆత్మహత్యనా.. హత్యనా అనేది తెలుతుందని హద్నూర్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హద్నూర్ పోలీసులు పేర్కొన్నారు.

70 శాతం ఆస్తిపన్ను వసూలు

కమిషనర్‌కి ఆస్తిపన్ను చెక్కు రూపంలో అందిస్తున్న పారిశ్రామికవేత్తలు

జిన్నారం మార్చి 3 : ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మొండి బకాయిదారుల నుంచి పన్ను వసూళ్లు చేపడుతున్నట్లు బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. రెండేండ్లుగా ఆస్తి పన్ను చెల్లించని భారత్ పెట్రోల్ బంక్ యాజమాన్యం సోమవారం ముందుకు వచ్చి కమిషనర్‌కు ఆస్తి పన్ను చెల్లించింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాల మేరకు 70 శాతం ఆస్తి పన్ను వసూలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం రూ.16.19 కోట్లకు రూ.11.32 కోట్ల పన్ను వసూలు చేశామన్నారు. మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్వో నర్సింలు, అకౌంటెంట్ శ్రీకాంత్, బిల్ కలెక్టర్లు, పారిశ్రామికవేత్తలు, పాల్గొన్నారు.

ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదు

అమీన్‌పూర్, ఫిబ్రవరి 3 : అమీన్‌పూర్ పెద్ద చెరువు నీటి ముంపు బాధితుల జేఏసీ ఎక్కడ ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడ లేదని జేఏసీ అధ్యక్షుడు చిరునామా సత్యనారాయణ పేర్కొన్నారు. ఆయన సోమవారం మాట్లాడారు. కావలిసిన ఖర్చులకు మాత్రమే అందరి సభ్యుల ఆమోదం మేరకు తీసుకోవడం జరిగిందని, అందుకు మినిట్స్ బుక్ ద్వారా ఖర్చుల వివరాలు తెలియపరస్తున్నామన్నారు. అంతేగానీ ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడానికి జేఏసీ సభ్యులందరూ తమ వెంట ఉన్నారని తెలిపారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

జహీరాబాద్, మార్చి 3 :రోజురోజుకూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలను పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ మహిపాల్ డిమాండ్ చేశారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలో సీఐటీయూ శ్రామిక విజ్ఞాన కేంద్రంలో కార్మికులకు కనీస వేతనాలను పెంచాలని డిమాండ్‌తో కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న సీఐటీయూ ఆధ్వర్యంలో పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు రాజిరెడ్డి, రవి, నరేశ్, మహేశ్, విజయ్‌సూరి, ఉమమహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ రఘువర్మ

జహీరాబాద్, మార్చి 3 : విద్యార్థులు మంచిగా చదివి శాస్త్రవేత్తలుగా ఎదగాలి నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ రఘువర్మ అన్నారు. సోమవారం న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్(బి) జడ్పీహెచ్‌లో ఏర్పాటు చేసిన స్పేస్, ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన రాకెట్ సైన్స్ అండ్ టెక్నాలజీపై దృశ్య రూపంతో తెరపై చూపించారు. చంద్రయాన్-3 సాధించిన విజయం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి భవిష్యత్‌లో సాధించే లక్ష్యాను ఎంచుకుని చదువుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం రాజ్ కుమార్, ఉపాధ్యాయులు కలిసి రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ రఘువర్మను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేతకీ ఆలయ హుండీ లెక్కింపు

ఝరాసంగం, మార్చి 3 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. మహాశివరాత్రి నవాహ్నిక జాతర బ్రహ్మోత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు స్వామివారి హుండీలో కానుకల రూపంలో వేసిన నగదు రూ.11 .70 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి శివరుద్రప్ప తెలియజేశారు. కామారెడ్డి పట్టణానికి చెందిన రాజరాజేశ్వర సేవా సమితికి చెందిన భక్తులు, హైదరాబాద్‌కు చెందిన చెన్నకేశవ సేవా సమితి, ఆలయ సిబ్బంది స్వామివారి హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. లెక్కింపు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగ రావు, ఆలయ సిబ్బంది, శేఖర్ పాటిల్, మల్లయ్య స్వామి, భక్తులు పాల్గొన్నారు. స్థానిక ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉపాధిపనులపై ప్రజావేదిక

హత్నూర, మార్చి 3 : హత్నూర మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పథకం పనులపై అధికారులు సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 సంవత్సరంలో హత్నూర మండలంలో ఉపాధిహామీలో చేపట్టిన పనులపై డీఆర్‌పీలు గ్రామాలవారీగా సేకరించిన నివేదికలను అధికారుల సమక్షంలో చదివి వినిపించారు. ఉపాధిహామీ కూలీలకు కల్పించిన పనుల వివరాలు, చెల్లించిన కూలీడబ్బులు, ఆయాసరుకులకు చెల్లించిన బిల్లులు తదితర అంశాలపై సమగ్ర నివేదికను తెలియజేశారు. ఉపాధిహామీలో జరిగిన అవకతవకలకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు సేకరించారు. కార్యక్రమంలో ఏపీడీ బాల్‌రాజ్, డీపీవో నాగేశ్వర్‌రావు, ఎస్ఆర్‌పీ కవిత, ఎం పీడీవో శంకర్, ఏపీవో ప్రవీణ్ కుమార్, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

రాజీతో కేసులు పరిష్కరించుకోవాలి

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

సంగారెడ్డి, మార్చి 3 : కోర్టులలో దీర్ఘకాలికంగా ఉన్న కేసులను ఇరువర్గాల కక్షిదారులు రాజమార్గంతో రాజీ చేసుకుని సమయం, ఆర్థిక లావాదేవీలను కాపాడుకోవాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని ఎస్‌హెచ్‌వోలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు పలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. కోర్టులో ఉన్న ఎలాంటి కేసులను కూడా రాజీ చేసుకునే అవకాశం జాతీయ లోక్ ఆదాలత్‌లో చేసుకొని ఇరువర్గాల కక్షిదారులు పరిష్కరించుకోవాలన్నారు. ఈ నెల 8న జరుగనున్న జాతీయ లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా కక్షిదారులకు కోర్టు విధులు నిర్వహించే పోలీసులు ప్రోత్సహించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ సంజీవరావు, డిఎస్పీ వేణుగాపాల్‌రెడ్డి, డీసీ ఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ దవాఖానలపై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి, మార్చి 3 : ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ దవాఖానలపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసు కోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు వైద్యాధికారులను కోరారు. సోమవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖాన డీఎంఅండ్ హెచ్ కార్యాలయం ఏవోకు సీపీఎం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వారం రోజుల వ్యవధిలో ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం వికటించి ఇద్దరు మృత్యువాత పడటం బాధాకరమన్నారు. ఇందుకు కారణం ప్రైవేట్ దవాఖానల యాజమాన్యాలు విచ్చలవిడిగా ఫీజులు వసూళ్లు చేస్తూ మధ్యతరగతి ప్రజలకు వైద్యం పేరుతో బాధించడం శోచనీయమన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ దవాఖానలపై కఠిన చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, కృష్ణ, నాయకులు రమేశ్, మల్లేశం, అర్జున్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 54 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 34,614 మంది విద్యార్థులు
- సీసీ కెమెరా నిఘాలో జరుగనున్న పరీక్షలు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 3 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 5 నుంచి జరుగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందర్‌రామ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 54 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఎక్కడా సమస్యాత్మక కేంద్రాలు లేవని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించారు. జిల్లా కలెక్టర్ చైర్ పర్సన్‌గా ఉన్న హైపవర్ కమిటీతో పాటు, 4 సిట్టింగ్ స్క్వాడ్, 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందా లు పరీక్షలను పర్యవేక్షించనున్నాయి. మొత్తం 54 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 54 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 926 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పరీక్షలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షా కేంద్రాల దగ్గరలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే కలెక్టర్ వల్లూరు క్రాంతి సమీక్షా సమావేశాలు నిర్వహించి సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లాలో పరీక్ష రాయనున్న 34,614 మంది విద్యార్థులు

జిల్లాలో ఏర్పాటు చేసిన 54 పరీక్షా కేంద్రాల్లో 34,614 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో మొదటి సంవత్సరానికి సంబంధించి మొత్తం 16,513 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, జనరల్ కేటగిరీలో 15,298 మంది, ఒకేషనల్ కేటగిరీలో 1215 మంది విద్యార్థులు ఉన్నారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి మొత్తం 18,101 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, జనరల్ కేటగిరీలో 16,483 మంది, ఒకేషనల్ కేటగిరీలో 1618 మంది విద్యార్థులు ఉన్నారు.

పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు : కలెక్టర్

జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ నెల 5 నుంచి 25తేదీ వరకు జరగనున్న ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో 54 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించాం. ఆర్డీవోలు తమ పరిధిలోని కేంద్రాలను విధిగా పరిశీలించాలని సూచించామన్నారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టామని వెల్లడించారు.

గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తాం

కోహీర్, మార్చి 3 : కోహీర్ పట్టణ గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు. సోమవారం కోహీర్ శాఖ గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.60 లక్షల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మిస్తామని వెల్లడించారు. పాఠకులకు ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లు, తదితర అన్ని సౌకర్యాలను కల్పిస్తామని వెల్లడించారు.

జరిమానా

కోహీర్, మార్చి 3: వాల్టా చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తే కఠిన చర్యలు తీసుకుంట